AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatoday.in

22-9-2025 (Monday) MAIN EDITION

## ఆర్‌వీఎన్‌ఎల్‌లో మేనేజర్ కొలువులు




**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** మేనేజర్, డిప్యూటీ మేనేజర్ పోస్టుల భర్తీ కోసం రైల్ వికాస్ నిగమ్ లిమిటెడ్ నోటిఫికేషన్ జారీ చేసింది. రెగ్యులర్ ప్రాతిపదికన ఈ పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిపింది. మొత్తం 17 పోస్టులను భర్తీ చేయనుంది. అక్టోబర్ 16లోపు ఆన్‌లైన్‌తో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. పూర్తి వివరాలకు అధికారిక వెబ్‌సైట్ https://rvnl.org/job లో సంప్రదించవచ్చు.

## నౌకలో చెలరేగిన మంటలు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** గుజరాత్‌లోని పోర్‌బందర్ సుభాష్‌నగర్ జెట్టీ వద్ద ఓ నౌకలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకొంది. జామ్‌నగర్ కేంద్రంగా పనిచేసే హెచ్‌ఆర్‌ఎం అండ్ సన్స్‌కు చెందిన ఓ నౌకలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఫైరింజన్లతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. తీరంలో మంటలు ఎగసిపడుతుండడంతో నౌకను సముద్రంలో కొంత దూరం తీసుకెళ్లి నిలిపారు.

## ఖలిస్థానీ ఉగ్రవాది అరెస్ట్



అక్షరటుడే, నేషనల్ డెస్క్: ఖలిస్థానీ ఉగ్రవాది ఇంద్రజీత్ సింగ్ గోసల్ కెనడాలో అరెస్టయ్యాడు. సిఖ్స్ ఫర్ జస్టిస్ అనే వేర్పాటువాద సంస్థ వ్యవస్థాపకుల్లో ఒకడైన గుర్‌పత్వంత్ సింగ్ పన్నూకు అతడు అత్యంత సన్నిహితుడు. ఆయుధాలు కలిగిఉండటం సహా పలు అభియోగాలపై గోసల్‌ను అట్టావాలో తాజాగా అదుపులోకి తీసుకున్నట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## సీపీఎల్ విజేతగా ట్రిన్‌బాగో నైట్ రైడర్స్




అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్ : కరేబియన్ ప్రీమియర్ లీగ్ 2025 గ్రాండ్ ఫినాలేలో ట్రిన్‌బాగో నైట్ రైడర్స్ విజేతగా నిలిచింది. గయానాలోని ప్రావిడెన్స్ స్టేడియంలో జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో గయానా అమెజాన్ వారియర్స్‌ను మూడు వికెట్ల తేడాతో ఓడించి ఐదోసారి టైటిల్‌ను కైవసం చేసుకుంది. నికోలస్ పూరన్ నేతృత్వంలోని నైట్ రైడర్స్ విజయంతో తమ ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది.

## తగ్గిన బంగారం, వెండి ధరలు..



అక్షరటుడే, బిజినెస్ డెస్క్: దేశంలో బంగారం, వెండి ధరలు స్వల్పంగా తగ్గాయి. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములకు రూ.10 తగ్గి రూ.1,12,140కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ. 1,02,790కి చేరుకుంది. ఇక వెండి కిలో ధర కూడా రూ.100 తగ్గి రూ.1,4,900గా నమోదైంది. పండుగల నేపథ్యంలో ధరలు మళ్లీ పెరగవచ్చని నిపుణులు చెబుతున్నారు.

## జీఎస్టీ కొత్త స్లాబ్‌లపై జగన్ ప్రశంసలు..



**అక్షరటుడే, వెబ్‌డెస్క్:** నేటి నుంచి అమల్లోకి వచ్చిన కొత్త జీఎస్టీ స్లాబ్‌లపై ఆంధ్ర ప్రదేశ్ మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశంసలు కురిపించారు. ఆయన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ‘‘జీఎస్టీ పునర్నిర్మాణం అనేది ఒక సరళమైన పన్ను వ్యవస్థ దిశగా విప్లవాత్మక అడుగు. ప్రతి పౌరుడికి వస్తువులు, సేవలు మరింత సరళంగా అందుబాటులోకి వచ్చేలా చేయడమే లక్ష్యం’’ అని అన్నారు. ‘‘ఈ కొత్త విధానం ద్వారా చివరి వినియోగదారుడికి కూడా ప్రయోజనాలు చేరతాయని ఆశిస్తున్నాను. కొన్ని లోపాలు, ఫిర్యాదులు ఉండొచ్చుగానీ, ఇది ఆర్థిక వ్యవస్థకు అవసరమైన బూస్ట్ ఇస్తుంది’’ అని పేర్కొన్నారు. కాగా.. జగన్ వ్యాఖ్యలు రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి.

## విద్యుత్ సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి ప్రభుత్వం నిర్ణయం

**అక్షరటుడే, వెబ్‌డెస్క్ :** రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు గుడ్ న్యూస్ చెప్పింది. విద్యుత్ సంస్థల్లో పలు పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. విద్యుత్ శాఖ పరిధిలో ట్రాన్స్‌కో, జెన్‌కో, ఎన్‌పీడీసీఎల్, ఎస్‌పీడీసీఎల్ ఉన్నాయి. గతంలో ఆయా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి విడివిడిగా నోటిఫికేషన్లు విడుదల చేసేవారు. ఇక నుంచి అన్ని సంస్థల్లో పోస్టుల భర్తీకి కామన్ నోటిఫికేషన్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అభ్యర్థుల ప్రయోజనార్థం ఒకే నోటిఫికేషన్ జారీ చేయాలని నిర్ణయించినట్లు ప్రభుత్వం తెలిపింది. విద్యుత్ శాఖ పరిధిలో మొత్తం 3 వేల పోస్టులు భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఈ మేరకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

## 923 ఎకరాలను ఆక్రమణల నుంచి రక్షించాం: హైడ్రా



**అక్షరటుడే, హైదరాబాద్:** ఆక్రమణల నుంచి ఇప్పటివరకు మొత్తం 923 ఎకరాలను రక్షించామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సుమారు రూ.50 వేల కోట్ల విలువైన ప్రభుత్వ భూములను రక్షించినట్లు చెప్పారు. హైదరాబాద్ నగరంలో దాదాపు 60 చెరువులు కనుమరుగయ్యాయన్నారు. ఆరు చెరువులకు పూర్తిగా పునరుజ్జీవం కల్పించినట్లు వివరించారు. ప్రభుత్వ భూమిలోని 260 నిర్మాణాలను తొలగించామని వివరించారు.

> దేశానికి విద్యుత్ వెలుగులు పంచడంలో సింగరేణి కార్మికుల పాత్ర ప్రత్యేకం. కార్పొరేట్ సంస్థలతో పోటీపడేలా సింగరేణిని నడిపిస్తాం. సింగరేణి మొత్తం రూ.2,360 కోట్ల లాభం అర్జించింది. ఇందులో కార్మికులకు 34 శాతం బోనస్ ఇస్తున్నాం. రెగ్యులర్ కార్మికులకు రూ.1,95,610, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 చొప్పన బోనస్ అందిస్తాం. దీపావళికి మళ్లీ బోనస్ ప్రకటిస్తాం. —సీఎం రేవంత్ రెడ్డి




# సింగరేణి కార్మికులకు దసరా కానుక

సింగరేణి కార్మికులకు ప్రభుత్వం దసరా బోనస్ ప్రకటించింది. సచివాలయంలో సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క లాభాల్లో వాటా ప్రకటించారు. సింగరేణి సంస్థకు గత ఆర్థిక సంవత్సరంలో వచ్చిన లాభాల్లో పెట్టుబడుల కోసం పోనూ మిగిలిన దానిలో 34 శాతం బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. సింగరేణి లాభం రూ.2,360 కోట్ల నుంచి 34 శాతం కార్మికులకు బోనస్ రూపంలో చెల్లిస్తున్నట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రకటించారు. ఒక్కో కార్మికుడికి రూ.1,95,610, కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్ ఇస్తామన్నారు. సింగరేణిలో పని చేస్తున్న 41 వేల మంది ఉద్యోగులు, కార్మికులు, 30 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులకు లాభాల్లో వాటా పంచుతామన్నారు. మొత్తం రూ.819 కోట్లు బోనస్ రూపంలో చెల్లిస్తున్నట్లు వెల్లడించారు.

—అక్షరటుడే, హైదరాబాద్

### ఒక్కొక్కరికి రూ.1.95 లక్షలు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయం

సింగరేణిని బలోపేతం చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఆర్థిక సంవత్సరంలో సంస్థకు 6,394 కోట్ల లాభాలు రాగా.. భవిష్యత్ పెట్టుబడుల కోసం రూ.4,034వేల కోట్లు కేటాయించినట్లు సీఎం తెలిపారు. మిగతా రూ.2,360 కోట్లలో 34 శాతం కార్మికులకు పంచుతామని వెల్లడించారు. కాంట్రాక్ట్ కార్మికులకు రూ.5,500 బోనస్ ఇస్తామన్నారు. కాంట్రాక్ట్ కార్మికులకు కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచే బోనస్ ఇస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి గనులు దేశానికి వెలుగులు ఇస్తున్నాయన్నారు. వాటిని కాపాడుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు.

#### తెలంగాణ ఆత్మ సింగరేణి

సింగరేణి కార్మికుల పిల్లలకు ఉచిత విద్య వైద్య అందిస్తున్నామని భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి సంస్థకు తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. సింగరేణి కాలరీస్‌ను విస్తరించేందుకు చర్యలు చేపడుతామన్నారు. తెలంగాణకు సింగరేణి ఆత్మలాంటిదన్నారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో సింగరేణి రెండు కోల్ బ్లాక్స్ కోల్పోయిందన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ సన్నిహితులకు ఆ బ్లాక్‌లు వెళ్లాయని ఆరోపించారు. వాటిని తిరిగి సాధిస్తామని ఆయన పేర్కొన్నారు.

## అమల్లోకి జీఎస్టీ 2.0




**అక్షరటుడే, బిజినెస్ డెస్క్ :** జీఎస్టీ సంస్కరణలు అమలులోకి వచ్చాయి. దీంతో వంటగదిలో ఉపయోగించే వస్తువుల దగ్గర నుంచి ఎలక్ట్రానిక్స్, మందులు, ఆటోమొబైల్స్.. ఇలా చాలా వరకు వస్తువుల ధరలు తగ్గాయి. జీఎస్టీ 2.0లో మొత్తం 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు దిగివచ్చాయి. ఆ జాబితాలో నెయ్యి, పనీర్, వెన్న, నమ్‌కీన్, కెచప్, జామ్, డ్రై ఫ్రూట్స్, కాఫీ, ఐస్ క్రీములు వంటి వాటితో పాటు.. టీవీ, ఏసీ, వాషింగ్ మెషీన్స్ కూడా ఉన్నాయి. ఔషధాలు, గ్లూకోమీటర్లు, డయాగ్నోస్టిక్ కిట్ల ధరలూ తగ్గాయి. హెయిర్ ఆయిల్, టాయిలెట్ సబ్బులు, డిటర్జెంట్ బార్లు, షాంపూలు, టూత్ బ్రష్‌లు, టూత్ పేస్టులు, టాల్కమ్ పౌడర్స్, ఫేస్ పౌడర్స్, షేవింగ్ క్రీమ్, ఆఫ్టర్ షేవ్ లోషన్ వంటి రోజువారీ వినియోగ వస్తువులు చౌకగా లభించనున్నాయి. సిమెంట్ 18 శాతం జీఎస్టీ పరిధిలోకి రావడంతో గృహ నిర్మాణదారులు ప్రయోజనం పొందుతారు. జీఎస్టీ రేటు తగ్గింపు వల్ల వాహనాల కొనుగోలుదారులు లాభపడతారు. ఇప్పటికే దాదాపు అన్ని వాహనాల కంపెనీలు తగ్గిన ధరలను ప్రకించాయి. వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీ ప్రీమియం కూడా తగ్గనుంది. జీఎస్టీ తగ్గింపు ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత, ఫార్మసీలు తమ ఎమ్మార్పీని సవరించాలని లేదా తక్కువ రేటుకు మందులను విక్రయించాలని కేంద్రం ఆదేశించింది.

## విమానంలో కలకలం..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఎయిర్ ఇండియా విమానంలో తీవ్ర కలకలం రేగింది. విమానంలోని కాక్‌పిట్ డోర్‌ను తెరవడానికి ఓ ప్రయాణికుడు యత్నించాడు. బెంగళూరు నుంచి వారణాసి వెళ్తున్న విమానంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఘటనపై ఎయిర్ ఇండియా స్పందించింది. సదరు ప్రయాణికుడు తొలిసారి విమానం ఎక్కినట్లు పేర్కొంది. దీంతో టాయ్‌లెట్ డోర్ అనుకొని కాక్‌పిట్ డోర్ తెరవడానికి యత్నించాడని ఒక ప్రకటనలో వెల్లడించింది. విమానం ల్యాండ్ అయిన తర్వాత ఈ విషయాన్ని సిబ్బంది సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో అతడిని అదుపులోకి తీసుకొని పోలీసులు విచారించారు. తాను టాయిలెట్ డోర్ అనుకొని కాక్‌పిట్ డోర్‌ను తెరిచే యత్నం చేసినట్లు ఆయన తెలిపాడు. కాగా సదరు ప్రయాణికుడితో మరో ఏడుగురు విమానంలో ప్రయాణిస్తున్నట్లు సమాచారం. వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు తెలిసింది.




## సొంత గడ్డపై పాకిస్థాన్ సైన్యం బాంబుల వర్షం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** పాకిస్థాన్ సైన్యం సొంత గడ్డపై చేసిన వైమానిక దాడుల్లో దాదాపు 30 మంది పౌరులు మరణించిన ఘటన ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున రెండు గంటల సమయంలో తిరాహ్ వ్యాలీలోని మాత్రె ధారా గ్రామంపై సైన్యం 8 బాంబులు జారవిడిచిందని అధికార వర్గాలు వెల్లడించాయి. ఈ దాడుల్లో చిన్నారులు, మహిళలు కూడా ప్రాణాలు కోల్పోయారని బాధిత కుటుంబాలు తెలిపాయి. దాడిలో అనేక ఇళ్లు నేలమట్టం కాగా, శిథిలాల కింద ఇంకా కొందరు చిక్కుకొని ఉండవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఉగ్రవాదుల ఉనికి ఉందన్న అనుమానంతోనే దాడులు జరిగాయా? లేక ఇతర మానవ తప్పిదాల వల్ల పౌరులపై దాడి జరిగిందా? అనే అంశాలపై చర్చ సాగుతోంది. ఖైబర్ పఖ్తుంఖ్వాలో ఇటీవల ఉగ్రవాద చర్యలు పెరిగిన నేపథ్యంలో, పాకిస్థాన్ సైన్యం ఈ దాడులు నిర్వహించినట్టు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## పవన్ కళ్యాణ్ ‘ఓజీ’ ట్రైలర్ వచ్చేసింది..




**అక్షరటుడే, సినిమా డెస్క్:** పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ ప్రధాన పాత్రలో రూపొందిన మోస్ట్ అవైటెడ్ గ్యాంగ్‌స్టర్ డ్రామా ‘ఓజీ’ ట్రైలర్ తాజాగా విడుదలైంది. దర్శకుడు సుజీత్ తెరకెక్కించిన ఈ స్టైలిష్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సెప్టెంబర్ 25న విజయదశమి కానుకగా విడుదల కానుంది. ఇప్పటికే రిలీజ్ అయిన మూవీ పోస్టర్స్, టీజర్, పాటలు ఫ్యాన్స్‌ను ఉర్రూతలూగించగా ఇప్పుడు ట్రైలర్ మరింత హైప్ క్రియేట్ చేస్తోంది.

## కాంతార చాప్టర్-1 ట్రైలర్ విడుదల



**అక్షరటుడే, సినిమా డెస్క్:** దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కన్నడ బ్లాక్‌బస్టర్ ‘కాంతార’కు సీక్వెల్‌గా వస్తున్న కాంతార చాప్టర్-1 థియేట్రికల్ ట్రైలర్ తాజాగా విడుదలైంది. రిషబ్ శెట్టి హీరో, దర్శకుడిగా నటించిన ఈ చిత్రం కోసం అభిమానులు ఎప్పటి నుంచో ఆతృతగా ఎదురు చూస్తున్నారు. తాజాగా విడుదలైన ట్రైలర్ ఆ అంచనాలకు తగిన స్థాయిలోనే ఉండడంతో సినిమాపై మరింత ఆసక్తి పెరిగింది. ‘నాన్న ఎందుకు ఇక్కడే మాయమయ్యాడు?’ అనే డైలాగ్‌తో ప్రారంభమయ్యే ట్రైలర్, సన్నివేశాల పరంగా అత్యుత్తమంగా కనిపిస్తోంది. గ్రాండ్ విజువల్స్, సాలిడ్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్, ఇంటెన్స్ ఎమోషనల్ టచ్‌తో ఈ ట్రైలర్ ఆద్యంతం ఉత్కంఠ కలిగించేలా సాగింది.

## బికినీలో సాయి పల్లవి..

టాలీవుడ్‌లో నేచురల్ బ్యూటీగా గుర్తింపు పొందిన సాయి పల్లవి తాజాగా ఓ బోల్డ్ లుక్‌తో వార్తల్లోకెక్కింది. ఇప్పటివరకు గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటూ సంప్రదాయబద్ధ నటిగా పేరొందిన ఆమె.. తాజాగా ఆమె బికినీలో ఉన్న ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రస్తుతం విదేశాల్లో ఉన్న సాయిపల్లవి తన చెల్లెలు పూజా కన్నన్‌తో కలిసి వెకేషన్ ఎంజాయ్ చేస్తోంది. అక్కడి బీచ్‌లో బికినీలో దిగిన ఫొటోలు ఇప్పుడు సోషల్ మీడియా వేదికగా తీవ్ర చర్చకు దారి తీశాయి. సాయిపల్లవిని ఇలా సడెన్‌గా బికినీలో చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. —అక్షరటుడే, సినిమా డెస్క్

